03102023-MAI-08_Layout 1 10/3/2023 2:46 AM Page 1

నమస్తే తెలంగాణ

హైదరాబాద్‌ను చూడండి!

హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరగడం, అందుకోసం మైనారిటీ వర్గీయులు తమ మిలాద్ ఉన్ నబీ ఊరేగింపును వాయిదా వేసుకోవడం గంగా జమునా తెహజీబ్‌కు నిదర్శనంగా నిలుస్తున్నది. మహా నగరంలో లక్షలాది మంది పాల్గొన్న బృహత్ నిమజ్జన కార్యక్రమం చిన్నపాటి అవాంఛనీయ ఘటన కూడా లేకుండా పూర్తికావడం ఇక్కడి ప్రజల సంస్కారం, సౌశీల్యతకు, అంతకు మించి సామరస్యానికి అద్దం పడుతున్నది. ఇక్కడి పాలకుల స్థితప్రజ్ఞతకు దివిటీలు పడుతున్నది. దేశంలో, ముఖ్యంగా ఉత్తరాదిలో రోజురోజుకూ మత సామరస్యం దిగజారిపోతున్నది. మతోన్మాదం జడలు విచ్చి వెర్రితలలు వేస్తున్నది. మూక మనస్తత్వం వేళ్లూనుకొని పౌరుల మనుగడకే ముప్పు వాటిల్లుతున్నది. 2014లో కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ సర్కార్ ఏర్పడిన నాటినుంచి అమలుచేస్తున్న రహస్య ఎజెండా అంతకంతకూ బాహాటంగా బయటికి వస్తున్నది. జాతి నర నరానా విద్వేష విషం ఎక్కించే ప్రయత్నం సామాజిక మాధ్యమాల ద్వారా, ఇటీవలి కాలంలో సినిమాల ద్వారా కూడా జరుగుతున్నది. దాని దుష్ఫలితాలను దేశం ఈసరికే చవిచూస్తున్నది. డబుల్ ఇంజిన్ సర్కార్ల పర్యవేక్షణలో మైనారిటీలు అభద్రతకు లోనై జీవిస్తుండటం ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యానికి శోభించే విషయం కాదు.

ముస్లింల నమాజు కోసం బస్సు ఆపారని హిందూ డ్రైవర్, కండక్టర్లను సస్పెండ్ చేయడం ఏమి సంస్కారం? ఓ పిల్లవాడిని క్లాస్ టీచరు కేవలం మతం పేరు మీద ఎత్తిచూపి మరో మతానికి చెందిన పిల్లల చేత అతడిని కొట్టించడం ఏ మహత్తర సంస్కృతికి ప్రతిబింబం? వినాయకుని మండపంలో నుంచి ఓ అరటి పండు తీసుకున్న పాపానికి ఓ యువకుడు హతమయ్యాడు. ఈ తరహా ఘటనలు చూసి ప్రజాస్వామ్యవాదులు బిత్తరపోతున్నారు. దేశం ఎటు పోతున్నదని కలత చెందుతున్నారు. ఇవి చాలవన్నట్టుగా జరిగిన మరోఘటన దేశాన్ని కుదిపేసింది. ప్రజాస్వామ్యానికి ఆలయం వంటి పార్లమెంటులో ఓ బీజేపీ ఎంపీ మరో పార్టీకి చెందిన మైనారిటీ ఎంపీపై వినశక్యం కాని బూతులతో విరుచుకుపడటం ఈ ధోరణికి పరాకాష్ఠ! కొత్త పార్లమెంటులో సరికొత్త సంప్రదాయానికి బీజేపీ పాలకులు తెరతీస్తున్నారని అనుకోవాలా? బీజేపీ ఎంపీ వాడిన బూతుల అర్థాలు తెలుసుకునేందుకు చాలామంది నిఘంటువులను వెతికే పనిలో పడ్డారు. బాధిత ఎంపీ కన్నీళ్లు పెట్టుకుంటూ సభ నుంచి వెళ్లిపోవడం ఏ మహోన్నత సంప్రదాయ ఫలితం? తప్పుచేసిన బీజేపీ ఎంపీని సభా నియమాల ప్రకారం ఎప్పుడు శిక్షిస్తారో తెల్వదు. శిక్షిస్తారో, లేదో కూడా తెల్వదు. కానీ, పాలకపక్షం శభాష్ అని భుజం తట్టినట్టు అతడికి మరో పదవి కట్టబెట్టి సత్కరించడం దేశం గమనిస్తున్నది. ఆయన తిట్లు ప్రయోగిస్తుంటే సభలోని బీజేపీ నేతలు ముసిముసి నవ్వులు నవ్వారని వార్తలు వచ్చాయి. వాటిని తర్వాత వారు ఖండించారనేది వేరే విషయం.

ఇంత జరిగినా దేశ ప్రధాని మణిపూర్ తరహాలో 'మౌనమే నా భాష' అంటున్నారు. ఆయన స్పందిస్తారని ఆశించే రోజులూ అయిపోయాయి. దేశాన్ని దుష్పరిపాలనతో కునారిల్లజేస్తున్న ప్రధాని మతం పేరు మీద, మత విద్వేషం తేరు మీద ఊరేగాలని చూస్తున్నారు. తమిళమంత్రి సనాతనధర్మం మీద చేసిన విమర్శపై స్పందిస్తారు. కానీ దేశాన్ని విద్వేషభరిత దుష్పరిపాలనతో పతనం అంచుకు చేర్చినవారు తమ నేతలు చేసే పనుల గురించి మాట్లాడరు. విద్వేష పరిభాష సృష్టించినవాళ్లే దాన్ని ఆపుతారని ఎలా అనుకోగలం? ఏతావాతా వివాదం ముదిరితే కంటితుడుపుగా, మణిపూర్ తరహాలో ఓ ప్రకటన పారేసి చేతులు దులిపేసుకుంటారేమో! తెలంగాణ ఆవిర్భావం గురించి పదేపదే అవాకులు చెవాకులు పేలే ప్రధానికి దేశంలో మత విద్వేషంపై నాలుగు మంచి మాటలు మాట్లాడేంత సమయం, తీరిక లేదా? దురదృష్టకరం!

విశ్వసనీయతే మహా మేనిఫెస్టో

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ప్రకటించి రెండు వారాలు దాటింది. భారీ ఖర్చు దృష్ట్యా దాని అమలు అసాధ్యమని భావించిన నిపుణులు, అసలు రాష్ట్ర బడ్జెట్ ఎంత? ఈ పథకాలకు అయ్యే ఖర్చెంత? అనే లెక్కలు ప్రకటించాల్సిందిగా పదే పదే కోరారు. కానీ కాంగ్రెస్ నుంచి ఈ రోజు వరకు స్పందన లేదు. అమలు చేసి తీరుతామని మాటలు చెప్పడం తప్ప లెక్కలేవీ చెప్పనప్పుడు వారిని విశ్వసించటం ఎట్లా? అందుకే ప్రజల్లో మొదటనే తలెత్తిన అనుమానాలు క్రమంగా మరింత బలపడుతున్నాయి.

టంకశాల అశోక్

రాష్ట్ర బడ్జెట్ రూ.2.77 లక్షల కోట్లు కాగా, కొన్ని అంచనాల ప్రకారం కేవలం ఆరు గ్యారెంటీలకే రూ.2.9 లక్షల కోట్లు ఖర్చవుతాయి. ఈ ఆరు కాకుండా కాంగ్రెస్ పార్టీ సెప్టెంబర్ 17 నాటి సభకు ముందే కొన్ని డిక్లరేషన్లు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలన్నీ కొనసాగిస్తామని చెప్తున్నది. వీటన్నింటికి కలిపి దాదాపు రూ.5 లక్షల కోట్లు కావొచ్చు. కాదంటే కాంగ్రెస్ పార్టీ తన లెక్కలేమిటో చెప్పాలి. బాధ్యత గల ఏ పార్టీ అయినా చేయాల్సిందేమిటి? ఆరు గ్యారెంటీలకే రూ.2.9 లక్షల కోట్లవుతుందని, ఆ మొత్తం రాష్ట్ర బడ్జెట్ కన్నా ఎక్కువని నిపుణులు అంచనా వేసినప్పుడు, గ్యారెంటీల అమలు సాధ్యం కాదని ప్రజల్లో అనుమానాలు కూడా మొదలైనప్పుడు వెంటనే జాగ్రత్తపడి తన లెక్కలేమిటో ప్రకటించాలి. ఆ పని చేయనట్లయితే అనుమానాలు బలపడి మొదటికే మోసం వస్తుందని గ్రహించాలి. హామీలను ప్రజలు గుడ్డిగా నమ్మే రోజులు పోయాయని అర్థం చేసుకోవాలి.

కానీ, అధికారం కోసం పదేండ్లుగా మొహం వాచి ఉన్న కాంగ్రెస్ ఈ విచక్షణనంతా మరిచిపోయింది. తెలంగాణ ప్రజల దృష్టిలో విశ్వసనీయతను కోల్పోయినందువల్లనే వరుసగా రెండుసార్లు చిత్తుగా ఓడామని, ఆ విశ్వసనీయతను తిరిగి కొంతైనా సంపాదించుకొంటే మరొక నాలుగు సీట్లయినా వస్తాయని అర్థం చేసుకోకుండా, అమలుకు సాధ్యం కాని హామీలను వినేందుకే కండ్లు తిరిగిపోయేటట్టు ఇస్తున్నది. ప్రజలకు పరిస్థితి అర్థమవుతున్నందున, ఈ తరహా హామీలతో వారిలో విశ్వసనీయత కోల్పోయినప్పుడు, సీట్లు పెరగడం మాట అటుంచి పరిస్థితి ఎదురు తిరగగలదు. ఈ విషయమై ప్రశ్నలు నిరంతరం కావటంతో ఆందోళన చెందుతున్న కాంగ్రెస్ నాయకుల నుంచి తాము హామీలను అమలు చేసి చూపగలమనే వాదనే తప్ప లెక్కలేవీ చెప్పలేకపోవడం ఒకట్టైతే, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు పరుస్తున్నామనే ప్రకటనలు రెండవది అవుతున్నది. కానీ వారి దురదృష్టవశాత్తు, తమ రాష్ట్రాల్లో అమలు చాలా లోపభూయిష్ఠంగా ఉందనే వివరాలు వెలికివస్తున్నాయి. కొన్ని అసలు అమలు కావడం లేదు. ఇది కూడా నరేంద్ర మోదీ హోరెత్తించిన 'గుజరాత్ మాడల్' వంటిదేనని ప్రజలకు క్రమంగా తెలియవస్తున్నది. వారి తాజా 'మాడల్' అయిన కర్ణాటకలో అప్పుడే కరెంట్ కోతలు, రైతుల ఆందోళనలు, పారిశ్రామిక రంగంలో బంద్‌లు, అనునిత్యం అవినీతి ఆరోపణలు, బియ్యం కొరతల వంటివి సర్వసాధారణంగా మారుతున్నాయి. దీనిపై తెలంగాణ కాంగ్రెస్ నోరు మెదపడం లేదు.

దీనంతటికీ భిన్నంగా తెలంగాణలో పరిపాలన ఏవిధంగా ఉందో, దాని సానుకూల ప్రభావం ప్రజలపై ఎంతగా ఉందో, ఆ దృష్ట్యా తమ విజయావకాశాలు ఏమిటో, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు తెలియదో లేక తెలిసినా దాచిపెడుతున్నారో గాని, స్వయంగా రాహుల్ గాంధీకి మాత్రం సరైన అంచనాలే ఉన్నట్టున్నాయి. గత నెల 24న ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో తప్పక(సర్టెయిన్లీ) గెలుస్తామని, తెలంగాణలో 'బహుశా(ప్రాబబుల్)' గెలవవచ్చని అన్నారు.

> కాంగ్రెస్ అంటున్నట్టు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసి ఉంటే, రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమం ఎంత మాత్రం లేకపోతే, అంతా అవినీతి-దోపిడీ మయంగా మారి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడినట్లయితే, అదే విధంగా తమ గ్యారెంటీలపై అంతటి నమ్మకముంటే, తెలంగాణలోనూ 'తప్పక(సర్టెయిన్లీ)' గెలవగలమని రాహుల్ ధీమాగా ప్రకటించి ఉండాల్సింది. అంతకన్నా ముందు, తమ విమర్శల్లో నిజం ఉందని నమ్మినట్లయితే అసలు ఇటువంటి అలవికాని గ్యారెంటీలు ఇవ్వాల్సిన అవసరం ఏమిటి?

ఇవన్నీ చాలవన్నట్లు, 'తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ' అంటూ మరోమారు గుర్తు చేయటం ఎందుకు? ఈ మాటలు ఎంత గుర్తు చేసినా 2014, 2018లో ఫలితం లేకపోయింది గదా? ఇక్కడి కాంగ్రెస్ నేతలు ఎన్ని కపటపు వేషాలు వేసినా, స్వయంగా రాహుల్‌తో సహా ఢిల్లీలో ఎవరెంత వ్యతిరేకించినా, సోనియాగాంధీ తన నైతిక దృఢత్వం వల్ల ప్రత్యేక రాష్ట్రాన్ని అనుకూలించటం ఎవరూ కాదనలేని వాస్తవం. ఈ మాటను కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో ప్రకటించడమేగాక, సకుటుంబంగా ఢిల్లీ వెళ్లి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరేమిటన్నది తెలంగాణ ప్రజలకు తెలుసు గనుకనే తాము కూడా వ్యక్తిగతంగా సోనియాగాంధీ పట్ల కృతజ్ఞతగా ఉంటూనే, తెలంగాణకు 1956 నుంచి 2014 వరకు అడుగడుగునా ద్రోహం చేసిన ఇక్కడి కాంగ్రెస్‌వాదులకు మాత్రం రాజకీయంగా గుణపాఠం చెప్తున్నారు. ఈ వాస్తవాన్ని గ్రహించి కూడా తమ ద్రోహాలను సోనియా కొంగుచాటున కప్పిపుచ్చుకొని, ఆమె పేరిట ప్రజలను ఏమార్చి అధికారం సంపాదించగలమని 2014, 2018 తర్వాత ఇప్పుడు మూడోసారి కాంగ్రెస్ నేతలు భ్రమపడుతున్నారు లేదా ఆత్మవంచన చేసుకొంటున్నారు. ప్రజలకు ఇవన్నీ తెలుసు.

రానున్న ఎన్నికల్లో అన్నింటికన్నా పెద్ద ప్రశ్న విశ్వసనీయతది. గ్యారెంటీలు, డిక్లరేషన్లు, మేనిఫెస్టోలు ఎవరేమి ప్రకటించినా, ప్రజలు దేని వెనక ఉన్నది ఎవరు? ఎవరి విశ్వసనీయత ఏమిటి? అనేది చూస్తారు. వారికి తమ అనుభవం, ఇంగితం చెప్పే విషయమది. ఆ విధంగా విచారించినప్పుడు ఒకవైపు కేసీఆర్‌కు, మరొకవైపు తెలంగాణ కాంగ్రెస్‌వాదులకు తమ విశ్వసనీయతలు లేదా అవిశ్వసనీయతలు రెండు దశలుగా ఏర్పడుతూ వచ్చాయి. మొదటి దశ 2014కు ముందటిది కాగా, రెండవ దశ ఆ తర్వాతది. ముందుగా కాంగ్రెస్‌ను చూస్తే, తెలంగాణ విషయంలో1956 నుంచి 2014 వరకు వారి వైఖరులు, వ్యవహరణలు, ద్రోహాలు ఏమిటో మళ్లీ చెప్పనక్కరలేదు. అదే విధంగా 2014 నుంచి చూస్తే రాష్ట్ర ప్రయోజనాల కోసం వారు ఇక్కడ, ఢిల్లీలో చేసిన ఘనమైన కృషి ఏమిటో ప్రజలకు తెలుసు. ఆ విధంగా ప్రజల దృష్టిలో వారి విశ్వసనీయతకు 2014 కన్నా ముందు దశలో పునాది పడలేదు. ఆ తర్వాతి దశలో నిర్మాణమూ జరగలేదు. కేసీఆర్‌కు సంబంధించి 2014 కన్నా ముందు బలమైన పునాది పడగా, ఆ తర్వాత ఆయన పరిపాలనను బట్టి అంతే బలమైన నిర్మాణం జరిగింది. ఇంకా జరుగుతున్నది. ఏదైనా ఒకసారి అన్నాడంటే చేస్తడు అనే పేరు కేసీఆర్‌కు వచ్చింది. ప్రజలకు ఇదంతా వందేండ్ల కిందటి చరిత్రేమీ కాదు. 1956 మొదలుకొని ఇప్పటివరకు ఇంకా జీవించి ఉన్న మూడు తరాలకు కూడా ఇదంతా జ్ఞాపకాల్లోని విషయమే. అందువల్ల వారికి ఎవరి విశ్వసనీయత ఏమిటో ఎవరూ చెప్పనక్కరలేదు. ఇటువంటి విశ్వసనీయతే అతి పెద్ద మేనిఫెస్టో అయినందునే గత రెండు ఎన్నికల ఫలితాలు ఆ విధంగా ఉన్నాయి.

నేడు తెలంగాణ ఏర్పాటును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన రోజు

ఉద్ధృత ఉద్యమంతో 'ఆమోదం'

రామకిష్టయ్య సంగనభట్ల
94405 95494

2009 నవంబర్ 29న కేసీఆర్ మొదలుపెట్టిన ఆమరణ దీక్షతో దిగొచ్చిన కేంద్రం డిసెంబర్ 9న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. కానీ సీమాంధ్ర నాయకుల ఒత్తిడి కారణంగా కొన్నేండ్లు ఆ ప్రక్రియను పక్కన పెట్టింది. అయితే 2011 నుంచి తెలంగాణ ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో 2013 అక్టోబరు 3న కేంద్ర మంత్రి మండలి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆమోదించింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా 1956లో హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలు, ఆంధ్ర రాష్ట్రం కలిపి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది. వరంగల్ నుంచి కొంత ప్రాంతాన్ని, గోదావరి జిల్లాల నుంచి భద్రాచలాన్ని, దండకారణ్యం ప్రాంతాన్ని కలిపి ఖమ్మం జిల్లాను ఏర్పరచారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన కొన్నాళ్ళకే తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ మొదలైంది. 1969లో మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉద్ధృత రూపం దాల్చింది. 1979లో హైదరాబాదు జిల్లా గ్రామీణ ప్రాంతాన్ని వేరు చేసి రంగారెడ్డి జిల్లాను ఏర్పాటుచేశారు. 2001, ఏప్రిల్ 27న కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేశారు.

2009 నవంబర్ 29న కేసీఆర్ మొదలుపెట్టిన ఆమరణ దీక్ష మలి దశ ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచింది. ఢిల్లీ పాలకులు స్పందించి రాష్ట్ర ఏర్పాటు ప్రకటనకు మూలమైన నేపథ్యం, నివేదిక ఇచ్చాయి. 2009 డిసెంబర్ 9న కేంద్రం దిగొచ్చి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. అయితే సీమాంధ్ర ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేసి ఒత్తిడి తేవడంతో కేంద్రం రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను పక్కన పెట్టింది. ఈ ఆలస్యం తెలంగాణ ఉద్యమకారుల్లో మరింత ఉద్రేకాన్ని రగిల్చింది. ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. ఉద్యోగులు, కార్మికులు 2011లో 42 రోజుల సమ్మె చేశారు. దీంతో కేంద్రంలో కదలిక వచ్చింది. 2013 అక్టోబరు 3న కేంద్ర మంత్రిమండలి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆమోదించింది. 2014, ఫిబ్రవరి 18న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును లోక్‌సభ, ఫిబ్రవరి 20న రాజ్యసభ ఆమోదించాయి. 2014 జూన్ 2న తెలంగాణ దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించింది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ తొలి, మలి ప్రభుత్వాలు ఏర్పాటు చేసి పరిపాలన కొనసాగిస్తున్నది.

వికారాబాద్, పరిగి పేరెత్తితే గుర్తు కొచ్చే రాజకీయ నాయకుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి. ఆయనంటే కొందరికి ప్రాణం...మరికొందరికి ఆశ..శ్వాస. ప్రజల కోసం కష్టపడటం, పదవుల కోసం కాకుండా నమ్మిన సిద్ధాంతం కోసం, ఇచ్చిన మాటను నిలుపుకోవడం కోసం ఆయన పడిన కష్టం నచ్చిందని అభిమానులు చెప్తారు. ఎన్నో మంచి పనులతో ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన అజాత శత్రువు ఆయన. అందరినీ కలుపుకుపోయిన.. అందరితో కలిసిపోయిన నాయకుడు.

మాట తప్పని ప్రజా నాయకుడు

మల్లేపల్లి నర్సింలు
91827 77968

హరీశ్వర్ రెడ్డి రాజకీయ జీవితం 1972లో వార్డు మెంబర్‌గా మొదలైంది. 1977లో ఉప సర్పంచ్ గా, 1980లో సర్పంచ్‌గా గెలుపొందారు. ఆ తర్వాత పరిగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలైనా ప్రజల్లోనే ఉండి వారి కోసం పనిచేశారు. 1985లో తొలిసారి తెలుగుదేశం పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత ఇక వెనుతిరిగి చూడాల్సిన అవసరం లేకుండా 1994, 1999, 2004, 2009ల్లో వరుసగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గెలిచిన ప్రతిసారి పరిగి ప్రజల కోసం ఏదో చేయాలనే తపన ఆయనలో కనిపించేంది. ఎన్నో అభివృద్ధి పనులు చేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. సౌమ్యుడిగా పేరొందిన ఆయన డిప్యూటీ స్పీకర్, టీటీడీ బోర్డ్ సభ్యుడు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌గా తన సేవలందించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పాత రంగారెడ్డి జిల్లాలో ముందు వరుసలో నిలబడి ఉద్యమించారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన ఆయన తన పనితీరుతో సీఎం కేసీఆర్ ప్రశంసలు అందుకున్నారు.

ఆయన నడక మంచి వైపు...ఆయన ఓర్పు మార్పు వైపు...ఆయన తపన ప్రజల కోసం. నీతి-నిజాయితీ ఆయన బలం. మంచితనం, మానవత్వం ఆయన బలగం. ఇచ్చిన మాట కోసం మాట తప్పని నాయకుడు.. పేద ప్రజల గుండె చప్పుడు..న్యాయం కోసం, నిజం కోసం, మంచి కోసం జీవితమంతా పోరాడిన నిక్కచ్చి నాయకుడు. ఎంత ఎదిగినా ఒదిగి ఉన్న నాయకుడు. 2014 నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నా ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండేవారు. చివరి నిమిషం వరకు ప్రజల సంక్షేమం కోసమే తపించారు. ఆయన అకాల మరణం పరిగి ప్రాంత ప్రజలను శోక సముద్రంలో ముంచెత్తింది.

మహిళా బిల్లు ఓట్ల కోసమేనా?

కడపత్రి ప్రకాశ్‌రావు
80966 77022

దాదాపు 27 ఏండ్ల ఎదురుచూపుల తర్వాత ఆమోదానికి నోచుకున్న మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ బిల్లు విషయంలో బీజేపీ తీసుకున్న నిర్ణయాలు, వేసిన ప్రతి అడుగును నిశితంగా పరిశీలిస్తే అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. బిల్లు అమలుపై బీజేపీ చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తున్నది. గడిచిన తొమ్మిదేండ్లుగా ఈ అంశంపై ఏనాడూ చర్చించని కమలం పార్టీ ఇంత హఠాత్తుగా బిల్లును తీసుకురావడం.. అదీ ఎన్నికల ముందు చేయడం వంటివి చూస్తే.. నిత్యావసరాల ధరలపై వెల్లువెత్తుతున్న నారీ లోకం ఆగ్రహం నుంచి తప్పించుకోవడానికే బీజేపీ ఈ బిల్లును తీసుకొచ్చిందన్న విమర్శలు వస్తున్నాయి.

మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అన్ని పార్టీల మద్దతు సంపూర్ణంగా ఉంది. వెంటనే ఈ బిల్లుకు సంబంధించిన చట్టాన్ని అమలు చేయమని అన్ని పార్టీలు కోరుతున్నాయి. కానీ 2029 నుంచి అమలు చేస్తామని బీజేపీ చెప్తున్నది. అంటే ఈ బిల్లును తాయిలంగా చూపి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ఓట్లు కొల్లగొట్టాలన్న ఆకాంక్ష బీజేపీ పెద్దల్లో కనిపిస్తున్నది. నిజానికి పెరిగిన నిత్యావసరాలు, గ్యాస్ సిలిండర్ ధరలు వంటివి సగటు కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటిని మహిళలు నిశితంగా గమనిస్తున్నారు. ఈ ప్రభావం నుంచి బయటపడి మహిళలకు ఒక ఆశ చూపించాలన్న ఉద్దేశంతోనే ఈ బిల్లు ఇప్పటికిప్పుడు పాస్ చేసినట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ఓట్లు చాలా కీలకం కానున్నాయి. గత ఎన్నికల ఓటింగ్ సరళిని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. మహిళల ఓటింగ్ క్రమేపీ పెరుగుతూ వస్తున్నది. రానున్న ఎన్నికల్లో పురుషులకు మించి మహిళల ఓటింగ్ శాతం పెరిగినా ఆశ్చర్యపోనక్కరలేదని నిపుణులు పేర్కొంటున్నారు. మహిళల్లో అక్షరాస్యత, ఆదాయం పెరుగుతున్న కొద్దీ రాజకీయ చైతన్యం హెచ్చుమీరుతున్నదని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రాజకీయాల్లో పాలు పంచుకోవాలనే ఆసక్తిని స్వయం సహాయక సంఘాలు స్త్రీలల్లో పెంచుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన బీజేపీ.. వారి ఓట్లు కొల్లగొట్టేందుకే ఈ ఎత్తుగడ వేసిందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుల్లో 14 శాతం మాత్రమే మహిళలున్నారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం రూపొందించిన మహిళా రిజర్వేషన్ల బిల్లులోనూ లోపాలున్నాయని, వాటిని సవరిస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని, ఇది మహిళల పట్ల చిత్తశుద్ధితో ప్రవేశపెట్టిన బిల్లులా కనిపించడం లేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ ఇప్పటికే విమర్శించారు. ఈ బిల్లు అమలుకు జనాభా లెక్కలు, డీలిమిటేషన్‌లు అడ్డుకాదని అన్ని పార్టీలు పేర్కొంటున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు అమలవుతున్న 33 శాతం రిజర్వేషన్ పొందేందుకు అన్ని స్థానిక సంస్థల్లో ఆ లెక్కలున్నాయి. చట్ట సభల్లోనూ ఇప్పటికిప్పుడు ఈ రిజర్వేషన్ అమలు చేయాలంటే... స్థానిక సంస్థల ప్రస్తుతం ఉన్న లెక్కలను ఆధారంగా చేసుకోవచ్చని నిపుణులు చెప్తున్నారు. కేంద్రం అనుకుంటే.. వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ అమలు చేయడానికి పుష్కలమైన అవకాశాలున్నాయి. విపక్షాలు వ్యతిరేకించిన వ్యవసాయ నల్ల చట్టాలకు బలవంతంగా ఆమోద ముద్ర వేసి అమల్లోకి తేవాలని ప్రయత్నించిన కేంద్రం, మహిళా రిజర్వేషన్ల బిల్లు అమలు విషయంలో ఆ ఉత్సాహం, చొరవ చూపకపోవడంలో ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తాయి.

> నింగినంటిన నిత్యావసరాలు, గ్యాస్ సిలిండర్ ధరలతో మహిళా లోకం ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఒక తాయిలంగా చూపి వారి ఓట్లు కొల్లగొట్టడమే బీజేపీ లక్ష్యంగా కనిపిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి బీజేపీ హయాంలో మహిళల కోసం ఏ ఒక్క కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేయలేదు.

ఈ పరిస్థితుల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం పోరు సల్పిన బీఆర్ఎస్.. దాని అమలు కోసం సైతం ఉద్యమబాట పట్టక తప్పదేమో అన్న పరిస్థితులే కనిపిస్తున్నాయి.

(వ్యాసకర్త: నమస్తే తెలంగాణ ప్రతినిధి, కరీంనగర్)



ఇదేం రాజనీతి?

రాజును ఎవరైనా ప్రశ్నిస్తే వాళ్లను జైల్లో వేస్తారు.. సస్పెండ్ చేస్తారు.. దాడి చేస్తారు.. వేటాడతారు..ట్రోల్ చేస్తారు. కానీ ఆ రాజు అనుచరులు తప్పు చేస్తే.. లైంగిక దాడి చేస్తే.. భయపెడితే.. వాళ్లను మాత్రం ఇంకోసారి అలాంటివి చేయొద్దని వేడుకుంటారు.

- ప్రకాశ్‌రాజ్, ప్రముఖ నటుడు